క్లుప్తంగా

పరిశుభ్రతకు ప్రాధాన్యం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శుక్రవారం శానిటరీ అధికారి శ్రీనివాస్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించారు. మురుగు కాల్వలు, నాలాలు, వాగుల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు, పొదలను పరిశీలించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ట్యాంకులు, వాల్వుల వద్ద నెలకొన్న అపరిశుభ్రతను తనిఖీ చేశారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

గీతంలో రక్తదాన శిబిరం

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లెఫ్ట్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. ఎన్టీఆర్ రక్త నిధి సౌజన్యంతో, రక్తదానాన్ని ప్రోత్సహించడం, క్లిష్టమైన పరిస్థితులలో ప్రాణాన్ని కాపాడడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 61 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది దానం చేశారు. రక్తదానం చేసిన వారికి పళ్లరసం, బిస్కెట్లను అందించారు. అలాగే ప్రశంసా పూర్వక ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ



నారాయణఖేడ్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన పత్తిరి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జహీరాబాద్, మెదక్ ఎంపీ సీట్లను బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తనను నియమించిన జిల్లా అధ్యక్షురాలితోపాటు అందుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైఫ్రూట్స్ పంపిణీ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రంజాన్ పురస్కరించుకుని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి డ్రైఫ్రూట్స్, సేమియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాల్గొన్ని పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గండిగూడెం రింగ్ రోడ్ సమీపంలో సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో పోలీసులు శుక్రవారం ఎండీఆర్ ఫౌండేషన్ కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

ముంగిలో ఇఫ్తార్ విందు



ముంగిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ముంగి గ్రామంలో ముస్లింలు శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్, పండరి, బక్కయ్య, మాణిక్‌రెడ్డి, సయ్యద్ షకీల్, నాగన్న తదితులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో ఉగాది సందర్భంగా నిర్వహించనున్న మత్తడి పోచమ్మ జాతర పురస్కరించుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేయించడం, జాతర నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పర్యవేక్షించారు. అలాగే, మంగల్‌పేట్‌లో దుర్గామాత ఆలయంలో శనివారం 17వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు మోహన్ జ్యోషి తెలిపారు.

మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్

బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మహనీయుని విగ్రహానికి, ప్రభుత్వ కార్యాలయాల్లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ మండల, గ్రామ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు: బాబు జగ్జీవన్ రామ్ కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తదితరులు



జహీరాబాద్ టౌన్: జగ్జీవన్‌రాంకు నివాళులు అర్పిస్తున్న గిరిధర్, నాయకులు ఉజ్వల్‌రెడ్డిలు



సదాశివపేట(సంగారెడ్డి): బాబు జగ్జీవన్‌రావు విగ్రహానికి నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్



జహీరాబాద్ టౌన్: పూల మాలలు వేస్తున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బీఆర్ఎస్ నాయకులు



పటాన్‌చెరు చైతన్యనగర్‌లో ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తదితరులు



జిన్నారం: ఊట్లలో యువజన సంఘాల నాయకులు



రామచంద్రాపురం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పుష్పనగేష్ తదితరులు



భెల్ టౌన్‌షిప్‌లో..



హత్నూర (సంగారెడ్డి): హత్నూరలో ..



నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఆనంద్ స్వరూప్ షెట్కార్



నాగిరెడ్డిపల్లిలో...

దాబాల వద్ద ఆర్టీసీ బస్సులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు



తూప్రాన్ బైపాస్ మార్గంలో దాబాల ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సులు

తూప్రాన్: ఆర్టీసీ డ్రైవర్లు దాబా హోటళ్ల యాజమానులు ఇచ్చే మాముళ్లకు అలవాటు పడి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రయాణికులను సకాలంలో గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన వారు రహదారుల పక్కన ఏర్పాటు చేసుకున్న దాబా హోటళ్ల వద్ద రాత్రి, ఉదయం వేళల్లో గంటల గంటలుగా నిలిపి వేస్తున్నారు. దీంతో అత్యవసరంగా సుదూర ప్రాంతాలకు వేళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాబా హోటళ్ల వద్ద బస్సులు నిలిపితే డ్రైవర్, కండక్టర్‌కు ఏది తిన్న ఉచితంగా దాబా యాజమాని అందజేస్తారు. ప్రతీ పండుగకు కానుకలు ఇస్తారు. ఇదిలా ఉంటే ఆర్టీసీ బస్టాండ్‌లో క్యాంటీన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ వారు బస్సులు నిలుపరు. ఇదిలా ఉంటే తూప్రాన్ మీదుగా హైదరాబాద్‌కు – నిజామాబాద్ వైపునకు వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే తూప్రాన్ పట్టణం గుండా రావాల్సిన బస్సులు బైపాస్ మార్గంలో వెళ్తున్నాయి. దాబాల వద్ద ఆపొచ్చునన్నా భావనతో బస్సు డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ తూప్రాన్‌లో బస్సులకు స్టాప్ లేదని ప్రయాణికులకు తెగేసీ చెబుతున్నారు. దీంతో బిక్కుబిక్కుమంటూ వేరే బస్సులు వచ్చేంత వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్‌లో క్యాంటీన్ నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించి టెండర్లు దక్కించుకున్నవారురికి గిరాకీ లేక వెళవెళబోతుంది. కొన్ని నెలలకే వాటిని తొలగిస్తున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ఆర్టీసీ అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి, ఆర్టీసీకీ ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటే ప్రభుత్వ ఖజానకు మేలు జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన బెల్టులతో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): మార్షల్‌ఆర్ట్స్‌లో మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శుక్రవారం జిల్లా కేంద్రం మెదక్‌లోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించిన రెంజికీ సుడోకాన్ కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీల్లో జూకల్ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మధుప్రియ, సంతోష్‌లకు గ్రీన్, చరన్ ఆరెంజ్, మల్లేశంలకు బ్రౌన్ బెల్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్‌లు నగేశ్, విద్యాసాగర్, దినకర్, జూకల్ కరాటే మాస్టర్ పరశురాం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జీనియస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: సీవీ రామన్ యంగ్ జీనియస్ ప్రతిభ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆర్ఎల్ఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. జి.ఆరాధ్యకు జాతీయ అవార్డురాగా, అతీక్యామొద్దీన్, కార్తికేయ, ఆరుష్‌పెలిక్స్, నాదియాలకు పురస్కారాలు దక్కాయన్నారు. హైదారాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సతీష్‌రెడ్డి, సినీ గేయ రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డు, పురస్కారాలు అందుకున్నారని చెప్పారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

తూముకు మరమ్మతులు చేయించిన అధికారులు

సాక్షి స్పందన



కిసాన్ సాగర్ చెరువు తూముకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలోని కిసాన్ సాగర్ చెరువు తూముకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేయించారు. నిర్వహణ లోపం, రైతుకు శాపం అనే కథనం గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు జెట్టి మిషన్ను తెప్పించి శుక్రవారం పాడైపోయిన తూముకు మరమ్మతులు చేయించడంతో చెరువు నుంచి నీరు విడుదలై పొలాలకు చేరింది. సమస్య పరిష్కారం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత



రామాయంపేట(మెదక్): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రంజిత్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన వ్యక్తి మరొకరి సహకారంతో రామాయంపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో బియ్యాన్ని సేకరించి కోళ్ల ఫారాలకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. తమకు అందిన సమాచారం మేరకు బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకొని 16 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం



బోరాంచ సాయిలు

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఇంటి నుంచి రూ.30 వేలు తీసుకొని బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సరాయి మజీద్ సమీపంలో నివాసం ఉండే బోరాంచ సాయిలు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. మార్చి 26వ తేదీన భార్య విజయతో గొడవపడిన అతను.. ఇంటి నుంచి రూ.30 వేలు తీసుకుని వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి తలంబ్రాలు

సంగారెడ్డి టౌన్: భద్రాచలంలో ఈ నెల 17న జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో దేవాలయ శాఖ సహకారంతో భక్తులకు ఇంటి వద్దకు తలంబ్రాలు చేరే కార్యక్రమాన్ని ఆర్టీసీ కల్పిస్తుందని మెదక్ రీజియన్ ప్రభులత అన్నారు. ఈ నెల 4 నుంచి 18 వరకు భద్రాచలంలోని సీతారాముల తలంబ్రాలను ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ద్వారా లేదా www.trrtcofirticr.in ఆన్‌లైన్ ద్వారా ఒక ప్యాకెట్ రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎగ్జిక్యూటివ్, ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డి

సంగారెడ్డి: పట్టణంలో శుక్రవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, 24వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ షఫీ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని పల్లెవెలుగు



బస్‌ను ప్రారంభిస్తున్న మదన్‌రెడ్డి(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంగా ఏర్పడి ఏడేళ్లు అయినా.. మౌలిక సదుపాయాలు లేవు. ఉమ్మడి కౌడిపల్లి మండలంగా ఉన్నప్పుడు గ్రామాల్లో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రస్తుతం లేదు. కరోనా వైరస్ వ్యాపించక ముందు కౌడిపల్లికి, గౌతాపూర్, ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం ఉండేది. కాలక్రమేణా ఆ గ్రామాలకు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు. పలువురు నాయకులు సంగారెడ్డి డిపో మేనేజర్‌ను సంప్రదించి, వినతిపత్రాలు అందజేయడంతో కేవలం విద్యార్థుల కోసం గౌతాపూర్, ఫైజాబాద్, బండపోతుగల్ గ్రామాల మీదుగా వెళ్లేందుకు ఒక బస్సు సౌకర్యం కల్పించారు. నర్సాపూర్ బస్ డిపో ఏర్పాటయ్యాక శీలాంపల్లి గేటు నుంచి సోమక్కపేట్, అంతారం, మీదుగా నర్సాపూర్‌కు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చొరవతో ఒక బస్ సౌకర్యం కల్పించారు. ఆ గ్రామాల మీదుగా వెళ్లే బస్‌ను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు ఘనంగా ప్రారంభించారు. కాగా ఈ ప్రారంభం మూడు రోజుల ముచ్చటగానే ఉంది. కేవలం పది రోజులు కూడా సక్రమంగా నడవకుండానే ఆ సర్వీస్‌ను నిలిపివేశారు. ఫైజాబాద్, అజ్జమర్రి రూట్లో వెళ్లే బస్సు, పాఠశాలలు ముగిశాక ఆ బస్సు సౌకర్యం నిలిపివేయకుండా అలాగే ఉంచాలని ఆయా గ్రామస్తులు కోరారు. అదేవిధంగా ఆ గ్రామాల్లో రూట్లో నుంచి సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, నర్సాపూర్ డిపో సూపరింటెండెంట్‌కు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.